# మొదటి తప్పు

"ఓటలునుంచి బయటకు రాంగానే యేంవో అన్నాను బారతంవంటి మాట. తచ్చనం సోపుదారల్లే అంగలేసుకుంటూ బజారొచ్చాను" అన్నాడు అబ్బాయిగారి సుబ్బాయి, లక్ష్మికె లచ్చన్నతో.

లచ్చన్నన్నాడు : "అదేందిరా! అంత తాగటం ఎందుకురా?"

"ఏడ్చావులేరా, అసలు తాగకూడదుగాని మొదలెట్టాం అంటే అంతు లేదురా."

"చదేలే అంతా సొంతం చెప్పు!"

"బయటకు రాంగానే బజారులో నడవటం మొదలెట్టంగానే భూమంతా గిర్రుగిర్రుమని తిరిగిందిరా. సెట్లన్నీ సిత్రంసిత్రంగా కన బడ్డాయిరా. అట్టాగే పోతుండా. ఆడిటస్సాకొయ్యా! యంపీగాడుండనే ఉన్నాడు. అల్లుడ్ని కావలించుకున్నట్టు రెండు సేతుల్తో పట్టుకున్నాడు."

"ఎక్కడుండానోయి" అన్నాను.

"ఆ, పోలీసు టేసనుకు దగ్గిరేలే!" అన్నాడు.

"ఏం గమ్మత్తురా? నే నెప్పుడూ టేసను పోలేదు. సరేలే అదీ ఓసారి చూద్దాం అనుకున్నా !

పోయాం టేసనుకు. అక్కడ చాపైనా లేదు. ఓ గదిలోకి తీసుకు పోయాడు. మూల ఒక ముంతుంది. అంతే. నాకు నిద్రొస్తోంది. బోర్ల పడ్డాను.

కాసేపయిం తర్వాత ఎంపీ కాన్స్టేబులు మళ్లొచ్చాడు. ఓయి అన్నాడు. లేచాను. ఇన్స్పెక్టరు పిలుత్తున్నాడన్నాడు.

ఆల్రైట్ అని లేచాను. పోయాం ఆయన దగ్గిరకు. నేను గబగబా నడిసాను. టేబిలు ఎదురుగా దడాలున ఆగాను. ఆయనా, అక్కడున్నోళ్ళూ నవ్వారు. నాకూ నవ్వొచ్చింది.

"ఇదుగో సూడండి! నన్నేం చాత్తారేం?" అన్నాను.

"మరేంలేదు. ఈ రాత్రికక్కడే ఉంటావు. రేపు నిన్ను విశారిస్తారు. అయిదు రూపాయిలు పైనేత్తారు మొదటి తప్పు గనుక. తర్వాత మీ కంపెనీ పోవొచ్చు." అన్నాడు ఇన్స్పెక్టరు.

జైలు గీలు లేదన్నమాట. సర్లే ఇక్కడ్లేకపోతే యేం. కంపెనీ పోంగానే రాత్రి అబ్సెంటు అని అక్కడేత్తారు.

ఇట్టా మాట్టాడుతుండంగా ఇద్దరు ఎంపీలు నా జేబులు తడివారు. డబ్బూ డుబ్బూ తీసుకున్నారు. అయిం తర్వాత మళ్ళీ నా గదికి నన్ను పంపారు. మళ్ళీ బోర్లపడ్డాను.

అబ్బ నేల సల్లగా ఉందిరా. ముడుసుకున్నాను ముడుసుకున్నాను. ఎనిమిది వంకర్లతో ముడుసుకుని నిద్రపోయాను.

లేలే అన్నాడెవరో పొద్దున్నే. లేచాను. అడే ! నన్ను పట్టుకొచ్చిన ఎంపీగాడే....

తీసుకుపోయా డిన్స్పెక్టరు దగ్గిరకు. పోతుంటే ఈడికిదంతా కొత్త సార్ అని ఇన్స్పెక్టరుతో అన్నాను. కొత్తయితే ఎన్నాళ్ళల్లో పాతవు తుందిలే అన్నాడాయన అని సెప్పాడు ఎంపీగాడు. అదే మొట్టమొదట నాతో అంతసేపాడు మాట్లాట్టం. ఆలోచించా, ఆలోచించాను. చివరకు మా లెఫ్టినెంటంటూండే మాట మనసు కొచ్చింది....థేంక్యూ అన్నాను.

ఇన్స్పెక్టరు దగ్గిరకు పోంగానే రాత్రి నా దగ్గిర తీసుకున్న డబ్బూ డుబ్బూ అంతా ఇచ్చేశాడు. మేజిస్ట్రేటు దగ్గిరకు పోవాలిప్పు డన్నాడాయన.

"సరే సార్" అన్నాను నేను, నేను నా ఎం.పి. గాడూ మేజిస్ట్రేటు ఆపీసు పోయాం. అక్కడ నా బోటి పచ్చులే కొంతమంది బిక్కమొగంతో ఉన్నారు బయట. అళ్ళను పట్టుకొచ్చిన ఎం. పీ. లు అళ్ళతో నవ్వుతూ

నవ్వుతూ ధైర్యం సెపుతుండారు. ఎవరేం మాటాడాలో ఆళ్ళకవి ఇవరంగా తెలియజేత్తుండారు.

"నేనేం సెప్పాలి?" అని అడిగాను నా ఎం పీ గాడ్ని.

"సెప్పు. సారీ సార్ అని సెప్పు. ఛమించమను అంతే!" అన్నాడు. ఉండంగా ఉండంగా నా పేరు పిలిశారు. మేజిస్ట్రేటు ఎదటికి పోయాను. ఎవడో వచ్చి నా మీద చార్జి చదివాడు.

గుమాస్తాగాడు, "తాగి తందనా లాడావా రోడ్డుమీద రాత్రి?" అని ఆచ్చర్యం పోయినాడల్లే అడిగాడు.

"నిజమే" అని నచ్చజెప్పాను.

"ఏందైనా సెప్పుకుంటావా?" అని అడిగాడు.

మొదటసారి ఆట్టాని కొచ్చినప్పుడు ఈజిమీద ఎట్టా డంగై నుంచుం టాడో మడిసి అట్టా అయిపోయాను. నోట మాటరాదు. ఎంపీ గాడన్నది మరిసిపోయాను.

అటూ ఇటూ సూసి సాలాసేపటి కన్నాను. "ఎంపీగాడ్లు నన్ను సాలా మర్యాదగా సూశారు సార్. గవీగిదీ ఇచ్చారు సార్. ఆళ్ళదేం తప్పు లేదు సార్! నాదే తప్పు. ఛమించండి." అన్నాను.

ఆ మాటకంతా నవ్వారు. నాకు అయిదు రూపాయలు పైను ఏశాడన్నా ఏం అనుకోలేదు. రాత్రినుంచీ అయిన గంద్రగోళానికేం అనుకోలేదు. కానీ నే నన్నమాటల కాళ్ళు నవ్వేప్పటికి ఒక్కొక్కడ్ని కోద్దామనిపించిందిరా!"

"నిజం! నిజంరా! అబ్బాయిగారి సుబ్బాయి! నువ్వన్నదాన్లో నువ్వు గింజంతబద్ధమైనా లేదురా" అన్నాడు లక్ష్మికె లచ్చన్న.